మంచి

ఎన్. ఎస్. ప్రకాశరావు

పూర్వం భరతఖండంలోనే 'పుణ్యభూమి' అని ఒక చిన్నరాజ్యం వుండేది. ఆ రాజ్యంలో పుణ్యాత్ములు చాలామంది పుట్టేరుట. అందుకనే, దానికాపేరు వచ్చిందని చెప్పుకునేవారు.

పుణ్యభూమిలో 'విద్యానిధి' అని ఒక గురువుగారు వుండేవారు. ఆయనకి సకల విద్యలూ వచ్చునట. పుణ్యభూమిలో పుట్టిన పుణ్యాత్ముల్లో ఆయనకూడా ఒకరని అంతా అనుకునేవారు. ఆయన్నిగురించి ఎవరెంత పొగిడినా, ఎంత గొప్పగా చెప్పుకున్నా, ఒక విప్పలాంటి నిజం మాత్రం వుంది.

విద్యానిధిగారి దగ్గరికి విద్యాభ్యాసం కోసం ఎక్కువ మంది వచ్చేవారు కారు.

ఎందువల్ల ?

శిష్యులచేత అడ్డమైన చాకిరీ చేయించుకుంటారనా? పాఠాలు ఎగ్గొట్టి, వూసుపోక కబుర్లుచెబుతూ. రోజులు వెళ్ళబుచ్చుతారనా? శిష్యుల్ని కొడతారనా, తిడతారనా? లేకపోతే, ద్రోణాచార్యుల్లాగ ఆయనకేమైనా కులతత్వం నరనరాల్లో జీర్ణించుకుపోయిందనా?

ఎందువల్ల ఆయన శిష్యుల్ని ఆకర్షించలేక పోతున్నారు?

ఈ ప్రశ్నలు ఆ రోజుల్లో చాలామంది బుద్ధిమంతుల్ని వేధించేయిట.

కాని, విద్యానిధిగారిలో ఈలక్షణాలు కంచు కాగడాలువేసి వెతికినా కనిపించవని ఆనాటి పండితులు సరేసరి: వణిక్ప్రముఖులూ, రాజ దర్బారులోని పెద్దలూ కూడా అనేవారు.

మరైతే, ఆయనకి శిష్యులు లేకపోవడానికి కారణం ఏమిటి?

"విరబూసిన పారిజాతానికి గొంగళిపురుగులు పట్టినట్టు", అంతగొప్ప గురువుగారిలోనూ ఒకేఒక 'దుర్గుణం' వుండేదిట. అదేమిటంటే, ఆయన తనకి తారసపడిన

930

వాడినల్లా —"బాబూ! మంచిగావుండు నాయనా! మంచిని పెంచు బాబూ!" అనే వారుట, అంతే!

అయితే,

మంచిగా వుండమని ఎంతమంది చెప్పడంలేదు? అంతమాత్రానికే శిష్యులు రాకపోవాలా?

అదీకాదుట అసలుకారణం. విద్యానిధిగారి దగ్గరికి కొన్నేళ్ళకిందట, పుణ్యభూమి యువరాజు విద్యాభ్యాసంకోసం వచ్చేడు. మరి, ఆ తరవాత ఏం జరిగిందో, ఏమో? ...విద్యాభ్యాసానంతరం, ఆ యువరాజు తండ్రిగారి దగ్గరికి వెళ్ళి, "నాకు పట్టాభిషేకం చెయ్యొద్దు! నేను పరిపాలన చెయ్యను!" అన్నాట్ట. ఎవరెంత చెప్పినా విన్నాడుకాడుట. ఆ బెంగతో, ఆ రాజుగారు మంచం పట్టేరుట ఇదే అదునని ఆ రాజుగారి తమ్ముడి కొడుకు, సింహాసనాన్ని ఆక్రమించేడు

మరి, ఆ యువరాజేమయేడు?....'మంచితనం పెరగాలి!' అని పిచ్చివాడిలా(!) అరుస్తూ, రాజవీధుల్లో తిరిగి తిరిగి, ఆఖరికి అడవులుపట్టి పోయేట్ట. ఇప్పటికీ అత నేమైపోయేడో ఎవరికీతెలీదు.

ఇలాగే, ఒక వైశ్య శిఖామణికూడా తన కుమారరత్నాన్ని విద్యానిధి దగ్గరికి చదువులకి పంపించేడు. 'ఈపెద్ద చదువులన్నీ నీకొడుక్కికూడా ఎందుకు? వాడిక్కావల్సిన చదువేదో నువ్వేచెప్పగలవు కదా!' అని చాలామంది శ్రేయోభిలాషులు ఆవణిక్ప్రముఖుడికి చెప్పేరుట. అయినా, అతను వాళ్ళమాటలు విన్నాడుకాడు.

ఫలితం అనుభవించేడు!

ఆ పుత్రరత్నంకూడా, విద్యాభ్యాసం అయిపోవగానే ఇంటికి వెళ్ళి, తండ్రికి వ్యాపారంలో సాయం చెయ్యవల్సింది పోయి, మీదుమిక్కిలి ఎదురు తిరిగి తండ్రికే సలహాలు ఇవ్వడం మొదలెట్టేడుట. —ఈ వ్యాపారం మానెయ్యమనీ! ... కనీసం లాభాలు గడించడమైనా మానెయ్యమనీను!

ఆ వ్యాపారస్థుడు నెత్తీనోరూ బాదుకొని, కొడుక్కి నచ్చజెప్పబోయేట్ట. కాని, అది "చెవిటివాడి ముందు శంఖం వూదినట్టే" అయింది.

"నా ఆస్తిలో చిల్లిగవ్వ నీకివ్వను. ఆ తరవాత నీగతి కుక్కలకూడా పట్టదు!" అని నయానా భయానాచెప్పి చూసేట్ట ఎన్నిచెప్పినా, ఆకొడుకు- 'లాభాలు తియ్యడం మాన' మనే అన్నాడుకాని, మరోమాట అనలేదుట.

931

తరవాత ఏంవుంది?

తండ్రీ కొడుకూ విడిపోయేరు.... కన్నకొడుకు, కళ్ళముందరే కూలీగా మారి పోయేడన్న కఠోరసత్యాన్ని కడుపులో పెట్టుకొని (కుములుతూనే) ఆ వైశ్య శిఖామణి తన మామూలు వ్యాపారం మామూలుగా ఒంటరిగానే చేసుకొంటూ బతికేడు.

వీళ్లు చాలరా? ... విద్యానిధులవారి శిష్యులకి మచ్చుతునకలు।

మహారాజు కొడుక్కే దిక్కులేకపోయింది కదా! చదువుకుందికని వెళ్ళిన పిల్లలు 'మంచి'ని సాధిస్తారని ఇళ్ళువదిలిపోతే, కడుపు కట్టుకొని చదివించే సామాన్యుల గతేంకావాలి? ... మొత్తంమీద విద్యానిధిగారికి శిష్యులులేరు।

ఆ తరువాత ఆయన కొన్నేళ్లపాటు, 'నిరుద్యోగం'తో బాధపడవలిసొచ్చింది. ఆయన అంత కష్టదశలో వున్నప్పుడుకూడా, ఆయన మంచితనాన్నీ, విద్యాపారంగత్వాన్నీ నగరంలోని పండితులూ, ప్రముఖులూ ప్రశంసించడం మాత్రం మానలేదు. (పొగడ్తలు ఆకలి తీర్చవుకదా!)

ఇలా వుంటూవుండగా, పుణ్యభూమి రాజధానికి ఏభైయోజనాల దూరానవున్న ఒక పల్లెటూరునించి 'అమాయకుడు' అనే యువకుడు విద్యానిధులవారి దగ్గరికి చదువుకుందికివచ్చేడు. ఆ యువకుడి అసలుపేరు ఇంకేదో వుందిట. కాని, అతన్ని ఎరిగినవారంతా అతనికి ఆపేరే స్థిరపరిచేరట.

అమాయకుడికి కూడా, విద్యానిధిగారిలాగే, చిన్నప్పట్నించీ మంచి అంటే చచ్చేంత ప్రేమట. అతను విద్యానిధి గారి దగ్గిరికి రాకముందు నలుగురైదుగురు గురువులని కొలిచేడట కాని; ఆగురువుల—గూడు పుఠాణీలు; వారి కులాభిమానాలు; శాఖాభిమానాలు, ధనాపేక్షలు। కక్షలు—చూసేక; వాళ్ళకి మంచిని బోధించబోయాడట. వాళ్ళు ఇతన్నీ; ఇతని 'మంచి'నీ భరించలేక; 'నీలాంటివాడికి ఆవిద్యానిధి ఒక్కడే తగును. అక్కడికి పో!' అన్నారట.

అయితే, అమాయకుడు శిష్యరికానికి వచ్చేసమయానికి విద్యానిధి వృద్ధులై పోవడమే కాకుండా, పక్షవాతంతో మంచం పట్టేరు కూడాను.

అయినప్పటికీ, ఆపుణ్యాత్ముడు ఈఅమాయకుణ్ణి చేరదీసి; విద్యాబుద్ధులు నేర్పసాగేరు. అమాయకుడు కూడా ఎంతోభక్తి శ్రద్ధలతో గురువుగారికి శుశ్రూష చేస్తూ వుండేవాడు. కాని, కొన్నాళ్ళతరువాత ఒకరోజున హఠాత్తుగా విద్యానిధులవారికి

932

తను చచ్చిపోతానేమోనని అనుమానంవేసింది. వెంటనే, ఆయన అమాయకుణ్ణి దగ్గిరికి పిలిచి,

"చూడు నాయనా! ఇంకనేను ఎన్నోఘడియలు బతకను. ఈలోకంతో నాబాంధవ్యంతీరిపోతోంది. కాని, నాకుఒక్క బాధ. నేను నాజీవితంలో చేద్దామనుకొని చెయ్యలేకపోయిన పనిఒకటుంది. ఆపని నువ్వుసాధించాలి" అన్నారు.

"చెప్పండి స్వామీ! తప్పకుండా సాధిస్తాను. నా ప్రాణాలు పణంగా పెట్టైనా సాధిస్తాను సందేహించక చెప్పండి" అన్నాడు అమాయకుడు.

అప్పుడు ఆగురువుగారు చిరునవ్వునవ్వి 'అమాయకుడా! నాకుతెలుసు నువ్వు అందుకు సమర్థుడివే!'

.... విను. భగవంతుడు సృష్టించిన ఈలోకంలో, పిపీలికాది బ్రహ్మపర్యంతం అనేక జీవరాసులున్నాయి. కాని, వాటిలోమానవుడిదే మహోత్కృష్టమైనజన్మ. ఎందుకంటే, మానవుడికి మేధస్సుని ప్రసాదించేడుసర్వేశ్వరుడు. కాని, ఈమానవుల్లో కొందరు తమమేధస్సుని మోసాలు చెయ్యడానికీ, కుట్రలూ కుహకాలూ పన్నడానికీ, పొరుగువాడి పొట్టకొట్టడానికీ వినియోగిస్తున్నారేతప్ప, మరొకందుకు వినియోగించడం లేదు.... ఎందువల్లనంటావు?" —అని ఆగేరు విద్యానిధిగారు.

"పాపంపెరిగి పోతోందికదా గురువర్యా!

అదీగాక కలియుగం కదా!" అన్నాడు అమాయకుడు, 'ఇంతేకదా! అన్నట్టు.

"నాయనా! అది మ్లేచ్ఛులు చెప్పేమాట. అసలుకారణం అదికాదు. కొందరు మానవుల్లో దుర్మార్గత్వం ప్రబలిపోతోంది అంటే వాళ్ళలో మంచితనం మంటగలిసి పోతోందన్నమాట వాళ్ళలోనూ భగవంతుడున్నాడు. నువ్వుచెయ్యవల్సిందల్లా ఒక్కటే! ఆ దుర్మార్గుల్ని సన్మార్గులుగా మార్చు. వాళ్ళలో మంచిని పెంచు నువ్వు వాళ్ళకి నచ్చజెప్పితే, వాళ్ళలోవున్న భగవంతుడు వాళ్ళని తప్పక మారుస్తాడు ... నాకుతెలుసు. నువ్వు ఆపని చెయ్యగలవు" అని గురువుగారు ఆగి, చిన్ననవ్వు నవ్వేరు.

అమాయకుడికి— గురువుగారి ఆ ఆజ్ఞవిన్నాకా, ఆ నవ్వు చూసేకా— ఉద్రేకం ఉప్పొంగింది. "అనుమానించకండి గురువర్యా! నేను తప్పక సాధిస్తాను. మంచిని పెంచి తీరుతాను. చెడ్డవాళ్ళలో నిద్రపోతున్న భగవంతుణ్ణి తట్టి లేపుతాను. మీరు విశ్రాంతగా వుండండి" అన్నాడు.

933

అయినా, ఇంకా గురువుగారు నవ్వుతూనే వుండడం చూసి, అతనికి అనుమానమూ అవమానమూ ఒకేసారి కలిగేయి.

"నన్ను నమ్మండి స్వామీ! సందేహాలన్నీ వదిలిపెట్టండి. నేను నా ప్రాణం పోయినా సరే, మంచిని పెంచుతాను" అన్నాడు మళ్ళీ.

అప్పటికీ విద్యానిధులవారు నవ్వుతూనేవున్నారు. అమాయకుడు భయపడుతూ ఆయన్ని కుదిపిచూసేడు. ఆయన తల ఒకపక్కకి వాలిపోయింది.

విద్యానిధులవారి నిర్యాణ వార్త నగరంలోనేకాక, పుణ్యభూమి అంతటా "కార్చిచ్చులా" వ్యాపించింది.

సంతాప సభలు పెట్టేరు. 'ఆయన మరణం పుణ్యభూమికి తీరనిలోటు' అంటూ కవులు కావ్యగానం చేసేరు. ఓ మహాకవి, 'ఆయనతోపాటే మంచికూడా మరణించింద'ని పద్యాలు రాసేడు కూడాను.

ఆతరవాత, రాజధానిలో చెరువుగట్టునవున్న పాలరాతి విగ్రహాలలో విద్యానిధులవారి విగ్రహంకూడా చేర్చాలని పెద్దలంతా నిశ్చయించేరు.

కొద్దిరోజుల్లోనే, పూరవతల చెరువుగట్టున విగ్రహం– విద్యానిధులవారి పాలరాతి చూడ ముచ్చటైనది– వెలిసింది

ప్రతీరోజూ, ఆవిగ్రహం పాదాలదగ్గిర అమాయకుడు విషణ్ణవదనుడై కూర్చొనేవాడు.

ఆ చెరువుగట్టున దాదాపు పదిదాకా విగ్రహాలున్నాయి. 'భగవత్సృష్టిలోని మానవులంతా సమానులు' అని చెప్పినాయన విగ్రహం, ఆ కొసానుంది. ఆయన పేరు, పుణ్యభూమిలో ప్రతి ఇంటా కనీసం ఒకరికైనా వుంది.

దానిపక్కనే వున్న విగ్రహం– 'స్వార్థమే అనర్థం' అన్న సూక్తిని చెప్పిన పుణ్యపురుషుడిది. ఆయన పుట్టినరోజు పండుగని ప్రతీ సంవత్సరం, పుణ్యభూమిలో మహావైభవంగా జరుపుతూ వుంటారు.

ఈ విగ్రహానికి ఎడమవైపున ఎత్తుగావున్న బుర్రమీసాలాయన పసితనంలోనే పరమ భాగవతోత్తముడిగా మారిపోయేరు. ఆయన బోధనలన్నీ ఒక్కముక్కలో చెప్పాలంటే– 'పేదలను ప్రేమించు'. ఆయన విగ్రహం కిందనే ఆమాట చెక్కివుంది.

934

ఈవిధంగా ఆచెరువు వొడ్డునవున్న విగ్రహాలన్నీ పుణ్యభూమి పేరు నిలబెట్టిన పుణ్యాత్ములవి. పుణ్యభూమి ప్రజలందరికీ ఈ విగ్రహాలు ఒట్టి (పాల) రాతిబొమ్మలు కావు; అవతారపురుషుల లీలామానుష విగ్రహాలు!

గురువుగారి విగ్రహం దగ్గిర అలా కూచుని కూచుని, ఆఖరికి ఒకరోజున— ఆయన పాదాలకిందవున్న మాటల్ని లక్షోసారి చదివేడు.

—'మంచిని పెంచు!'

గుండెలనిండా గాలిపీల్చుకొని, 'ఔను! నేను మంచిని పెంచుతాను!' అనుకొని గభీమనిలేచి, నగరంకేసి బయలుదేరేడు అమాయకుడు.

అప్పటికే బాగా చీకటిపడిపోయింది. దానికితోడు మంచుకూడా కురుస్తోంది. నగరంలోకి వెళ్తూవుంటే, ముందు కూలీనాలీ జనాల వాడలు తగుల్తాయి. పెద్దవాళ్ళ పాపం పేదవాళ్ళ నెత్తికెక్కినట్టు, ఆ పాకలమీద చక్కని చీకటిపరుచుకొని వుండి, అవి కనిపించడం లేదు అమాయకుడు ముందుకు సాగేడు

కార్తీకమాసం. నగరంలో — రాజప్రసాదాలూ, వ్యాపారస్థుల వాకిళ్ళూ, కవి పండితుల భవనాలూ, దేవాలయాలూ— అన్నీ (నేతి?) దీపాలతో కళకళ్లాడుతున్నాయి.

నగరం నడిబొడ్డునవున్న కన్యకాపరమేశ్వరీ ఆలయానికి వెళ్లేడు అమాయకుడు. కోవెల్లోపల శాస్త్రులవారు పురాణం చెప్తున్నారు. అప్పటికే ముగింపుకి వచ్చినట్టుంది: మరి కాసేపటికల్లా, ఆనాటి కథ ముగించి, 'సర్వేజనాస్సుఖినోభవంతు' అన్నారు శాస్త్రిగారు.

భక్తులంతా, ఒక్కొక్కరే (అతికష్టంమీద) లేస్తున్నారు. (వారిలో- పిల్లలంతా, పిల్లఏనుగుల్లాగానూ; పెద్దలంతా, ముసిలి ఏనుగుల్లాగానూ వున్నారు.) వారంతా లేచి, శాస్త్రిగారికి నమస్కరించి ఆయన పళ్ళెంలో యథాశక్తివేసి, భారంగా కదిలి పోతున్నారు

శాస్త్రులవారు పళ్ళెంలోకి చూసుకొంటూ, చేటంత మొహం చేసుకొని, ఇంకా ఎవరైనా వున్నారేమోనని తలెత్తిచూసేరు.

అమాయకుడు ఒక్కడే అక్కడ వున్నాడు.

అతన్ని చూడగానే, శాస్త్రిగారికి మొదట భయంవేసి, 'గతుక్కు' మన్నారు. కాని, అతని ముఖంలోకి మరోసారి చూసేక ఆ భయం పోయింది.

935

"ఎవరు నాయనా, నువ్వు? ఏం కావాలి?" అన్నారు శాస్త్రిగారు.

"నాకొక సందేహం వుంది స్వామీ! తమరు తప్పక తీర్చాలి" అన్నాడు అమాయకుడు.

"చెప్పు నాయనా!" అన్నారు శాస్త్రులవారు.

"మీరు ఎన్నాళ్ళనించి ఇలా పురాణం చెప్తున్నారు?"

ముప్పైఏళ్ళబట్టి చెప్తున్నానన్నారు శాస్త్రిగారు.

"ఈ ముప్పై ఏళ్ళలోనూ మీ బోధనలు విని, ఎవరైనా మంచివేవు మళ్ళేరా స్వామీ?" అన్నాడు అమాయకుడు.

శాస్త్రిగారు తుళ్ళిపడ్డారు. ఈ ముప్పైఏళ్లలోనూ, ఆయన్ని ఎవ్వరూ ఎన్నడూ అటువంటి ప్రశ్న అడగలేదు. అమాయకుడి ముఖంలోకి సూటిగా చూసేరు. ఆముఖం చూసేక మాత్రం ఆయనకి, ఎందుకో 'నిజం' చెప్పెయ్యాలనిపించింది.

"వెర్రివాడా! అది అంత సులభమనుకున్నావా? మంచిమాటలు వినగానే మారిపోడానికి, వాళ్ల వెర్రివాళ్ళనుకున్నావా! వాళ్ళకీతెలుసు నాయనా! తెల్లారి లేచింది మొదలు వాళ్ల చేసేవన్నీ పాపప్పనులేనని .. అందుకే, చీకటిపడ్డాక ఇక్కడికి వచ్చి, పురాణం విని, నాపళ్ళెంలో నాలుగుడబ్బులు పడేసి– ఆ రోజుపాపాలు ఆ రోజుకి కడిగేసుకొని పుణ్యం మూటగట్టుకోవాలని చూస్తారు వీళ్లు తెల్లారి లేచేక మళ్ళీ మామూలే!" అన్నారు శాస్త్రులవారు.

"అయితే, స్వామీ! పురాణం విని పుణ్యం సంపాదించినా, వీళ్లమళ్ళీ పాపప్పనులే ఎందుకు చేస్తూంటారు?" అన్నాడు అమాయకుడు అమాయకంగా.

శాస్త్రులవారు చిరునవ్వు నవ్వి. "చూడబోతే నువ్వు అమాయకుడిలావున్నావే! పురాణ శ్రవణంతోనే పాపపంకిలం ఒదిలిపోతే, ఇంకేంకావాలి నాయనా? భూలోకమే స్వర్గమైపోదా! పుణ్యం అన్నది స్వయంగా ఆర్జించుకోవల్సిందే!" అన్నారు.

అమాయకుడికి ఈ తర్కం నచ్చలేదు. శాస్త్రిగారితో చాలాసేపు వాదించేడు. వాదించి వాదించి, చివరికి తన గురువుగారి కడసారి కోరికనీ, తన అంతిమ ఆశయాన్నీ శాస్త్రిగారికి చెప్పి, మనుషుల్ని మంచివేపు మళ్ళించడానికి పురాణాన్ని మించిన మరో మంచిమార్గం చెప్పమన్నాడు.

అంతే!

936

శాస్త్రిగారు, హఠాత్తుగా పళ్లెంలోని సరుకుల్ని సంచీలోవేసుకొంటూ— "నువ్వు విద్యానిధి శిష్యుడివా, బాబూ!.... నీమాటా, నీ గురువుగారిమాటా వింటే, మాకు మళ్ళీ పచ్చి మంచినీళ్లు పుట్టవు. మావంశం తరతరాల్నించి, ఈ కన్యకాపరమేశ్వరీ ఆలయంలోనే పురాణం చెప్పుకొని బతుకుతోంది. వాళ్ళకి వ్యతిరేకంగా ఒక్కముక్క చెప్తే, మర్నాడే మనకు వుద్వాసన తప్పదు. ....వస్తాను బాబూ!" అంటూ శాస్త్రిల వారు వడివడిగా గడబిడగా వెళ్ళిపోయేరు.

అమాయకుడు, ఆ ఆలయప్రాంగణంలోనే, ఆలా చతికిలబడిపోయేడు.

ఆరాత్రి, ఆ చలిలోనే ముడుచుక్కూచుని, అతను అతితీవ్రంగా ఆలోచించేడు.

మర్నాడు తెల్లవారుతూనే, నగరంలోని ప్రముఖ వడ్డీవ్యాపారస్థుడి ఇంటికి వెళ్లేడు అమాయకుడు.

ఆ వడ్డీవ్యాపారికి పాతికేళ్ళ కిందట, ఒకేఒక పెంకుటిల్లు వుండేదిట. ఇప్పుడు- అటువంటి పెంకుటిళ్లు పాతికదాకా ఆయన స్వాధీనంలో వుండడమే కాకుండా, తను వుండడానికి ఒకపెద్ద భవంతికూడా వుంది. ఆ భవంతికే వెళ్ళేడు అమాయకుడు.

ఆ వ్యాపారి మహాదైవభక్తుడు. అందుచేత, ఒకజాము పొద్దెక్కేవరకూ పూజా మందిరం వదిలి బైటికిరాలేదు. ఆ తరవాత వచ్చి, కుశల ప్రశ్నలువేసి, వచ్చిన పనేమిటని అమాయకుణ్ణి అడిగేడు.

చల్లకొచ్చి ముంతదాచడ మెందుకని, 'ఈ వడ్డీవ్యాపారం ఎన్నాళ్లనించి చేస్తున్నా' రని అడిగేడు అమాయకుడు.

ఆదినుంచీ తమ కులవృత్తి ఇదే అన్నాడు వ్యాపారి.

ఈ వ్యాపారంలో ఇప్పటికి ఎంతగడించి వుంటారన్నాడు అమాయకుడు.

వడ్డీవ్యాపారి ఒక్కక్షణం చెప్పాలా వద్దా అన్న మీమాంసలో పడ్డాడు. ఆఖరికి, 'ఏదో తమపెద్దల దయవల్లా, భగవత్కృపవల్లా ఒకలక్ష వరాహాల్దాకా సంపాదించే' నన్నాడు.

అమాయకుడు ఒక్క నిమిషం ఆలోచించి హఠాత్తుగా, —"ఈ వ్యాపారం ఇంతటితో మానెయ్యకూడదా?" అని అడిగేడు.

'నీ ప్రాణాలు నాకు ఇచ్చెయ్యకూడదా?' అన్నట్టు బెదిరిపోయేడు వ్యాపారి.

937

"ఏం, ఎందుకు స్వామీ?" అన్నాడు కొంచెం తెప్పరిల్లి.

"ఓ వ్యాపారీ! నువ్వు ఇప్పటికి నీకేకాకుండా, నీముందుతరాలకక్కూడా సరిపడినంత కూడవేసేవు. కాని, నీదగ్గిర వడ్డీలకి అప్పులు పుచ్చుకొన్నవాళ్లు మాత్రిం ఆ అప్పులు తీర్చలేక, అల్లాడిపోతున్నారు. నువ్వు నీ పిల్లలకి ఆస్తులిస్తూవుంటే, వాళ్లు వాళ్లపిల్లలకి అప్పుపత్రాలు ఇస్తున్నారు.... పేదవాళ్లని ప్రేమించు నాయనా! వాళ్ళ ఎడల మంచిగా వుండు.... భగవంతుడు నీకు మేలుచేస్తాడు...." అంటూ మెత్తగా చెప్పేడు అమాయకుడు.

అంతావిని, "నేనుమాత్రం కసాయివాణ్ణనుకున్నారా స్వామీ? మా తండ్రిగారి ఆబ్దికంనాడు పేదలకి అన్నదాన వస్త్రదానాలు చేస్తున్నానే! విఘ్నేశ్వరుడికి వుండ్రాళ్లు పోయిస్తున్నాను; ఆంజనేయస్వామికి కొబ్బరికాయలు కొట్టిస్తున్నాను; శ్రీరామచంద్రమూర్తికి ఏటా కళ్యాణాలు చేయిస్తున్నాను; వెంకట్రమణమూర్తికి నేతి దీపారాధనలు చేయిస్తున్నాను; పరమశివుడికి సదేసరి, అభిషేకాలు చేయిస్తున్నాను.... ఇవన్నీ నేను నాస్తికుణ్ణయి చేస్తున్నానా స్వామీ?!" అన్నాడు వడ్డీవ్యాపారి.

"నిజమే నాయనా! నువ్వు సత్పురుషుడి వవడంవల్లె ఇవన్నీ చేస్తున్నావు. కాదనను. కాని పేదవాళ్ళని ఒక్కసారిచూడు. ఋణభారాల్తో ఎలా కుంగిపోతున్నారో, ఈ వ్యాపారం ఇంకమాని, నీ ధనంతో పేదలకి సాయంచెయ్యి నాయనా!" అన్నాడు అమాయకుడు బతిమాలుతున్నట్టు.

వడ్డీవ్యాపారి అంతా విన్నాడు. విన్నాక, మాంసాహారం మానమని చెప్పిన పసిపిల్లవేపు చూసిన పెద్దపులిలా చూసేడతను. అమాయకుడు ఈపులి చూపుల్ని గమనించక, తన మామూలు ధోరణిలోనే, ఇంకా ఏదో నచ్చజెప్పబోయేడు.

ఇంతలో— ఆ వడ్డీవ్యాపారి టక్కునలేచి నిల్చుని, "స్వామీ! ఇకమీరు దయచేయండి. ఇన్నేళ్లగా నేను చేసుకుంటున్న ఈ వ్యాపారం, ఎప్పుడో ఒకరోజున పేదవాళ్లకి పంచిపెట్టడంకోసం కాదు ... అయినా, కందకిలేని దురద మీకెందుకు? నా డబ్బుతో అవసరంవున్నవాళ్లు, నేనుచెప్పిన వడ్డీకి ఒప్పుకొని సొమ్ముతీసుకుంటున్నారు. తరవాత తీర్చగలిగితే, తీరుస్తారు. లేకపోతే, ఆ చికాకులేవో మేము చూసుకుంటాం. మీకవసరమైన విషయాల్లోకి దిగకండి.... వెళ్ళండి" అంటూ ఇంట్లోకి వెళ్లిపోయేడు.

938

మండుటెండలో, మళ్ళీ వీధిలోపడ్డాడు అమాయకుడు. వడ్డీవ్యాపారి తననింతలా అవమానిస్తాడని అతను వూహించలేకపోయేడు. ఒక్క క్షణకాలం, చెప్పలేనంత నిరాశ అతన్ని ఆవహించింది.

కాని, వెంటనే గురువుగారికి చేసిన వ్వాగ్దానం గుర్తుకొచ్చిందతనికి.... ఎన్ని కష్టాలు ఎదురైనా, మంచిని సాధించితీరాలి. మనుషుల్ని మంచివాళ్లగా మార్చాలి. ఈ వ్యాపారి మారకపోతే, పోనీ షరొాకవ్యాపారి మారడా? మనసు మార్చుకోడా?— అనుకొని మళ్ళీ బయలు దేరేడు.

ఈ నమ్మకంతోనే, ఎండనక వానఒక పుణ్యభూమిలోని ప్రతి వూరూ, పల్లే, గ్రామం— కాలినడక తిరిగి తిరిగి, పొలమూ పుట్రా, గొడ్డూగోదా పుష్కలంగా సంపాదించిన పెద్దలందరి దగ్గిరికీ వెళ్ళేడు

వారంతా, మొదట్లో ఇతను ముష్టికోసం వచ్చేడనుకొని, ఏదో ఇచ్చి పంపబోయేరు.

కాని ఇతను మళ్ళీవెళ్లి, 'మంచిగా వుండ'మనీ, 'పేదల్ని ప్రేమించమ'నీ చెప్తే, 'సరే, అలాగేలే' అన్నారు.... అన్నారేకాని, వారి పద్ధతులేవీ వారు మార్చుకోలేదు. మళ్ళీ నచ్చచెప్పడానికీ, బతిమాలడానికీ అమాయకుడు వెళ్తే, ఈసారి కసిరిపంపేసేరు.

అమాయకుడు గట్టిదెబ్బ తిన్నాడు!

'మరి, మంచిని సాధించలేనేమో? ... గురువుగారి కోరిక నెరవేర్చలేనేమో?' అనుకొంటూ, వెర్రివాడిలా వీధుల్లో తిరగడం మొదలెట్టేడు.

ఇలా తిరుగుతూవుండగా చూసి, రాజుగారి కొలువులోని ప్రముఖవేదాంతి ఒకడు అమాయకుణ్ణి రమ్మని కబురంపేడు. అమాయకుడు, ఆ రాజవేదాంతి దగ్గిరికివెళ్ళేడు.

"ఏమిటి నీబాధ?" అన్నాడు వేదాంతి.

తనబాధా, తన గురువుగారి బోధా— అన్నీ వివరించి చెప్పేడు అమాయకుడు. తన ఎడల పుణ్యభూమిలోని పెద్దల ప్రవర్తనకూడా ఆ సేదాంతికి వివరించేడు.

ఆ వేదాంతి అదంతావిని, వేదాంతపు నవ్వొకటి నవ్వి, "నాయనా! ఈలోకం మిథ్య. ఇందులో నువ్వు మిథ్య; నేను మిథ్య. ఆ పాపాలు చేస్తున్నవాళ్ళంటావా?..

939

వాళ్ళూ మిథ్యే! అసలుపాపమే ఒకపెద్ద మిథ్య. నేనొకమాట చెప్తాను విను. మనం మంచిగావుంటే, ఈ ప్రపంచం మనకంటికి మంచిగానే కనిపిస్తుంది. ఒక్కసారిచూడు-మానవులకోసం మానవుడు ఎంతటి రమ్యమైన లోకాన్ని సృష్టించేడో! ఈ మంచిని చూడ్డం అలవర్చుకో... చెడ్డనే అలా చూస్తూవుంటే, కొన్నాళ్లకి నువ్వూ దుర్మార్గుడివిగా తయారవుతావు. వెంటనే, నీలో హింసాప్రవృత్తి ప్రబలుతుంది. హింస మన కెవ్వరికీ మంచిదికాదు కదా! అంచేత, చెడుని మాటాడకు. అలాగయితే, నువ్వు సుఖంగా వుంటావు; కడంవాళ్ళని సుఖంగా వుండనిస్తావు" అని అతి సులువుగా, అరిటిపండు వలిచి చేతిలో పెట్టినట్టు చెప్పేడు.

అమాయకుడికి ఈ మాటలు నిజమనిపించేయి. ఈ 'నగ్నసత్యాన్ని' ఇన్నాళ్ళూ తెలుసుకోలేక పోయినందుకు విచారించేడు కూడాను.

"ధన్యుణ్ణి స్వామీ! మీ సలహా పాటిస్తాను" అని వెళ్ళిపోయేక.

కొన్నాళ్ళపాటు, ఈ సిద్ధాంతం బాగున్నట్టే అనిపించిం దతనికి, కాని, రోజులు గడుస్తూన్నకొద్దీ అతనికి మరొక కఠోరసత్యం అర్థమయింది. తను చూసినా, చూడక పోయినా- పేదవాళ్ళు చెమటోడ్చి పండించినదాన్ని. పెద్దవాళ్లు పంచుకుంటూవుండడం నిజం! తను కళ్లుమూసుకొని వున్నా, తెరిచేవున్నా— తిండికోసం చేసిన అప్పులు తీర్చలేక, బతుకులకి బతుకులే వడ్డీలుగా, వడ్డీలకి వడ్డీలుగా, వ్యాపారస్థుల గుప్పిళ్లలో ఇరుక్కుపోతూవుండడం సత్యం!! తను చెవులుమూసుకున్నా, మూసుకోకపోయినా-పుణ్యభూమి అంతటా అన్యాయానికి వాతబడ్డవాళ్లు రోదిస్తూనేవున్నారన్నది వాస్తవం!!

ఆలోచించగా ఆలోచించగా, మంచిని పెంచడానికి కాక, చెడునికూడా మంచిగానే చూపించడానికి మాత్రమే ఈ రాజవేదాంతం పనికొస్తుందని అమాయకుడికి రూఢిగా తెలిసిపోయింది.

దాంతో మళ్ళీ మొదలు!

ఈసారి మరీ పిచ్చిపట్టినట్టు తిరిగేడు అమాయకుడు.

ఇలా వుంటూవుండగా—

ఒకరోజు తెల్లవారుజామున అతనికి కలలో విద్యానిధులవారు కనిపించేరు. కనిపించి, "నాయనా! నాకోరిక నెరవేర్చడానికి నువ్వు పడుతున్న పాట్లన్నీ

చూస్తూనేవున్నాను. ఆఖరిప్రయత్నంగా ఒకమార్గం నాకు కనిపిస్తోంది. సంగీత సాహిత్యాలకి తలవూచని కఠినాత్ముడుండడు. నాగుబాము కూడా సంగీతానికి తలాడిస్తుంది. అందుచేత, నువ్వు కళాకారులద్వారా మనుషుల్ని మంచివేపు మళ్ళించగలవేమో చూడు'' అని చెప్పేరు.

ఏడేళ్ల తరవాత— కలలోనైనా— గురువుగారు కనిపించినందుకు ఉప్పొంగి పోయేడు అమాయకుడు.

గురువుల ఆజ్ఞని అనుసరించి, రాజాస్థానంలోని సంగీతవిద్వాంసుల్ని కలవడానికి వెళ్ళేడు. కాని, ఆ విద్వాంసుల్లో చాలామంది అతనికి దర్శనమే ఇవ్వలేదు. ఒకాయన మాత్రం కనిపించి, అమాయకుడి అభిప్రాయాలన్నీ తెలుసుకొని, వెక్కిరింత నవ్వొకటి నవ్వి— సంగీత సరస్వతిని అవమానించడానికే నువ్వు బయల్దేరేవన్నాడు. ఆ మహోన్నత కళని అల్పులకోసమూ, నీచులకోసమూ వినియోగించడం మహాపాపం అన్నాడు. అలగా జనంకోసం తనబోటివాడు వీణమీటినా, పాటపాడినా ఆవిద్య అంతటితో అంతరించి పోతుందన్నాడు. అలాచేస్తే, సంగీతకళకి మరి అధోగతి తప్పదన్నాడు ... మొత్తంమీద, తను కలిసిరాకపోవడమే కాకుండా, తోటివాళ్ళని రానీకుండా చూస్తానని శపథం చేసేడు.

అమాయకుడు హతాశుడయేడు. అయినా, ఎదురుదెబ్బలు తగులుతున్నకొద్దీ, అతన్లో (మొండి) పట్టుదల పెరిగింది.

'పోనీ, సంగీతంద్వారా కాకపోతే, కవిత్వంద్వారా మనుషుల్ని మారుస్తాను, మంచిని సాధిస్తాను'— అనుకొని, రాజాస్థానంలోని కవుల్ని కలిసేడు.

ఆ కవుల్లో కొందరు, ఆ సంగీత సార్వభౌముల్లాగే, "కళంకం; అపవిత్రం" అని తప్పించుకొంటే; మరి కొందరు— "పేద ప్రజలకోసం కవిత్వం రాయడమంటే, ప్రభువులకి వ్యతిరేకంగానే కదా? అది రాజద్రోహం కాదా?" అని ఎదురు ప్రశ్నలు వేసేరు. మరి కొందరు కవులయితే,— "కవయాః నిరంకుశః — అన్న సూక్తి నీకు తెలీదా?''మాకు, 'ఫలానాదిరాయి' అని చెప్పడానికి నువ్వెవరు? అలా చెప్పించుకొంటే, మా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు పోవా?" అని అడిగేరు. ఒక కవికులతిలకుడు, అమాయకుడి గోడంతా విని, "మన పుణ్యభూమిలోవున్న ధనవంతులే బహు తక్కువమంది. పూర్వజన్మ పుణ్యంవల్ల వాళ్ల ఆమాత్రంగానైనా వుంటున్నారు. ఆ బహుకొద్దిమంది మీదా అసూయతో కవిత్వం రాయడం దేశద్రోహం కాదా?" అన్నాడు.

941

ఆఖరికి రాజకవులుకూడా అమాయకుడిని దావుదెబ్బకొట్టేరు.

అమాయకుడికి కొత్త ఆలోచన తట్టింది. 'వాళ్ళనీ వీళ్ళనీ బతిమాలుకోవడం కన్న నేనే ఒక కావ్యం రాస్తాను' అనుకొన్నాడు. కొన్నాళ్ళపాటు సాధనచేసి, ఆఖరికి ఒక కావ్యం రాసేడు.

అందులో పద్యాలన్నీ కరుణరసాత్మకమైనవే। పేదల అగచాట్లని హృదయ విదారకంగా వర్ణించేవే।

అలాంటి కావ్యాన్ని తీసుకొని అమాయకుడు- వడ్డీవ్యాపారుల దగ్గిరికి, నగరంలోని పెద్దల దగ్గిరికీవెళ్ళి చదివి వినిపించేడు. వారంతా అదివిని, 'శభాష్' అన్నారు. బాగా మెచ్చుకున్నారు. పారితోషికాలు ఇవ్వబోయేరు. ఒక కోటీశ్వరుడు, తనకా కావ్యం అంకితమిస్తే, అక్షరలక్షలిస్తానన్నాడు. గజారోహణం చేయిస్తాం; సన్మానాలు చేయిస్తాం అన్నారు.

అన్నీ అన్నారుగాని, 'పేదల్ని పీడించడం మానేస్తాం' అని మాత్రం అనలేదు.

ఈదెబ్బతో, అమాయకుడు పూర్తిగా డీలాపడిపోయేడు. దిక్కుతోచక గిజ గిజలాడిపోయేడు.

ఆరాత్రి, పూరవతల చెరువుగట్టున గురువుగారి విగ్రహం పాదాలదగ్గర చతికిలబడ్డాడు.

అతనికి కళ్ళలో నీళ్ళు తిరిగేయి ... పదిహేనేళ్ళుగా తను ఇంత శ్రమపడుతున్నా, ఆశించిన దానిలో అణుమాత్రం కూడా సాధించలేకపోయేడు. అంతా అవుననేవాళ్ళేగాని, ఆచరించేవాళ్ళు లేరు. కొందరయితే, చెప్పరాని అవమానాలుకూడా చేసి పంపించేరు.... ఇదంతా ఎందుకోసం?— మంచికోసం. ఎవరి మంచికోసం?— బాధలు పడుతున్న వాళ్ళ మంచికోసం ఎవరాబాధలు పడుతున్నవాళ్లు?— పేదవాళ్ళు. వాళ్ళకి మంచిని సాధించడాని కిదిమార్గం కాదా? .. ఎడతెరిపిలేని ఆలోచనలు. అమాయకుడికి తలపగిలిపోతుందేమో ననిపించింది. కళ్ళుమూసుకున్నాడు.

అలా ఎంతసేపు వున్నాడోకాని, ఒక్కసారి వులిక్కిపడి చూసేడు.

ఆ చెరువుగట్టునే— ఒక బక్క ఆవు ప్రాణభయంతో పరుగులు పెడుతోంది. దానివెనకే పరమ భయంకరంగా "భౌ! భౌ!!" మంటూ, కుక్కొకటి పరిగెడుతోంది.

ఏ గడ్డివాముదగ్గిరికో వెళ్ళినట్టుంది ఆ ఆవు. అక్కడ కుక్క అరుపులకే దానికి సగం ప్రాణాలు పోయేయి. మిగతా సగం ఈ పరుగులో పోయేలావున్నాయి. అయినా పరిగెడుతోంది బక్కావు. కుక్క మరీ పుంజాలు తెంపుకొని వెంటాడుతోంది. ఏక్షణాన్నయినా, ఆవుకాలు పట్టుకొనేలావుంది కుక్క.

ఉన్నట్టుండి—

ఆ బక్కావు టక్కున వెనక్కి తిరిగింది. తిరిగీ తిరగడంతోనే బుర్రని బాగా కిందికి దించి, కుక్క డొక్కలో పొడిచింది. రెండు కొమ్ముల్తోనూ కుక్కని పైకెత్తింది.

అమాయకుడు దిగ్గునలేచి నించుని, చుట్టూచూసేడు. పంచమి చంద్రుడు వెన్నెలలు పంచిపెడుతున్నాడు. వెన్నెలలో పాలరాతి విగ్రహాలు వింతగా మెరుస్తున్నాయి చెరువులో నీళ్లు తళతళలాడుతున్నాయి.

దూరంగా ఎత్తుగావున్న నగరం. మినుకు మినుకుమంటున్న దీపాలతో భూతాల దీవిలావుంది.

దిగువని, అక్కడికి దగ్గిరగావున్న కూలిజనాల పాకలకేసి చూసేడు అమాయకుడు. పూరిపాకలన్నీ, ఆ వెన్నెల వెలుగులో, తలలు కిందకిదించి, నగరం డొక్కలో పొడవడానికి సిద్ధంగావున్న వింత జంతువుల్లా కనిపించేయతనికి.

వెనక్కి తిరిగిచూడకుండా, చకచకానడుస్తూ నగరానికి దూరంగా సాగిపోయేడు అమాయకుడు.

గంధర్వగానాన్ని బండరాళ్లు కరిగించడానికి ఇంతకాలం వృథాచేసేనే అన్న బాధకన్నా, ఇప్పటికైనా అవి బండరాళ్ళని తెలుసుకున్నందుకు ఆనందంగా వుందతనికి.

* * *

ఆ తరవాత అమాయకుడు ఎవరికీ కనిపించలేదు. వూరు వదిలిపోయేడన్నారు కొందరు. కాదు, మనరాజ్యమే వదిలిపోయేడని మరికొందరన్నారు.

ఈ చల్లనివార్త వూరి పెద్దలందరికీ మలయమారుతంలా తగిలింది.

ఒకటి– రెండు– నాలుగు– ఐదు; ఐదేళ్ళు గడిచేయి. కాని, అమాయకుడి జాడ తెలియలేదు. అతను మరణించేడేమోనన్న ఆశాభావం వెలిబుచ్చేరు కొందరు.

943

అతను నిజంగా మరణిస్తే, అతనికూడా ఓ పాలరాతి విగ్రహాన్ని చేయించాలని ఒకాయన అన్నాడు. అయితే, అమాయకుడి 'నిర్యాణం' రూఢిగా తెలియకపోవడంవల్ల విగ్రహస్థాపన జరగలేదు.

ఈ నాలుగైదేళ్ళయి—

వడ్డీ వ్యాపారం వెనకటికన్నా సజావుగా సాగుతోంది.

రైతులకష్టాన్ని, భూస్వాములు పూర్వంకన్నా ఎక్కువగానే అనుభవిస్తున్నారు.

పురాణం శాస్త్రిలూ, కవులూ, సంగీత విద్వాంసులూ పూర్వంకన్న ఎక్కువగానే రాజస్తోత్రాలు చేస్తూ, ఎప్పటిలాగే పారితోషికాలు పొందుతున్నారు.

పెద్దలంతా ఇలా హాయిగా వుంటూవుండగా— హఠాత్తుగా పుణ్యభూమిలో "పాపచింతన" పొడసూపింది.

పండిన పంటంతా, పండించినవాడిదేనని, ''న్యాయంగా'' కామందుల కివ్వవలసిన భాగాన్ని ఇవ్వడం మానేసేరు— రైతులు. వడ్డీలకి అప్పులు పుచ్చుకొన్నవాళ్ళు, అసలు సంగతి దేవుడెరుగును; వడ్డీలుకూడా ఇవ్వం పొమ్మన్నారు. అణగిమణగివుండే జనంవంతా ఇలా రేగిపోడం ప్రారంభించేరు.

వణిక్ప్రముఖులు, వాణిజ్యవేత్తలు, వడ్డీవ్యాపారులు, కామందులు, కోటీశ్వరులు —అంతా ఈ విపరీత పరిస్థితికి హడలిపోతున్నారు. ఏం చెయ్యడానికీ వారికి దిక్కుతోచడంలేదు. అక్కడికీ, చేతిలోవున్న నౌకర్లనీ, చాకర్లనీ కత్తులిచ్చి జనంమీదికి పంపించేరు. వాళ్ళైనా, అనుమానం వున్నవాడి గుండెల్లో కత్తులైతే దించగలిగేరు కాని, చెలరేగిన జనాన్ని ఆపలేకపోయేరు.... ఎక్కడ విన్నా అమాయకుడిపేరే! మనిషి మాత్రం దొరకడు!

పెద్దలందరికీ వ్యవహారం తమచెయ్యి దాటిపోయిందని తెలిసిపోయింది. మొరపెట్టుకుందికి మహారాజు దగ్గిరికివెళ్ళేరు;

''భగవద్దత్తమైన తమ రాజ్యాధికారాన్ని కూలదోయడానికిది ప్రయత్నం కాదా, ప్రభూ?''

''వేల వరహాల అప్పుపత్రాల్ని నాకళ్ళముందే భోగిమంటలు వేసుకున్నారు. దంద్రుణ్ణి, ఇక తమరే కరుణించాలి మహారాజా!''

944

"నీటిలోని చేపనైనా పట్టుకోగలం కాని, ఈ అమాయకుడు మాత్రం అంతు చిక్కడం లేదు: అతనిమీద రాజద్రోహ నేరం మోపి, అతని శిరస్సుకి మంచి బహుమానం ప్రకటించండి ప్రభూ!"

"పల్లెపట్టుల్లో రాజుకుంటున్న ఈ నిప్పురవ్వలు మన నగరాలని రగిలిస్తాయి: మనం ముందే జాగ్రత్త వహించాలి స్వామీ!"

"ఈ అమాయకుడు ఎవరో కాదు మహారాజా! ఆనాడు తమరు సింహాసనాన్ని అధిరోహించడానికి కారకుడైన విద్యానిధి శిష్యుడు. చచ్చిపోయేడనుకున్నాం. ఇప్పుడిలా తయారయేడు. సంఘవిద్రోహ శక్తుల్ని మొగ్గలోనే తుంచెయ్యాలి ప్రభూ!"

"తమర్ని మహారాజుగా గుర్తించడం మాని, వాళ్ళ రాజ్యాన్ని వాళ్ళే పాలించుకుంటారట మహారాజా!"

"ప్రభువులు చెప్పిన మంచినికాదని, ప్రజల మంచిని సాధిస్తామని బయలుదేరిన వాళ్ళని సరికెయ్యడానికి ఆనాడు సింహపురి ప్రభువులకి మనం సైనికసహాయం చేసేము కదా! ఈనాడు, ఈ ఆపత్సమయంలో మనకి వారి అండదండలు కూడా వుంటాయి. తమరు మరి తాత్సారం చెయ్యకండి మహాప్రభూ!"

"శాంతిభద్రతలు కాపాడండి! మా ఆస్తికీ, ప్రాణాలకి రక్షణ కల్పించండి!! ధర్మం నిలబెట్టండి!!!"

—అంటూ అలనాడు ముక్కూ చెవులూ తెగిపోయిన శూర్పణఖ, రావణుడి దగ్గిర గోలపెట్టినట్టు మహారాజు దగ్గిర గోలపెట్టేరు పెద్దలంతా.

మహారాజుగారు అంతా శ్రద్ధగావిన్నారు. విన్నాక దీర్ఘంగా ఆలోచించేక, దృఢ నిశ్చయంతో సింహాసనంలోంచి పెద్దపులిలా లేచేరు.

ఆయన ఆధీనంలో రథ, గజ, తురగ, పదాతిదళాలు వేలాదిగా వున్నాయి. పేదింటివాళ్ళే అయినా, ప్రభుభక్తి పరాయణులైన సైనికులున్నారు. మారణాయుధాలు మరెన్నోవున్నాయి.

* * *

యతో ధర్మ స్తతో జయః

945